




మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలతో వార్డు వలంటీర్లు

వలంటీర్లపై.. వత్తిడి!

- 24 మంది వలంటీర్‌లు రాజీనామా
- ఈ రెండు రోజుల్లో మరింత పెరిగే అవకాశం
- రాజీనామాకు కొందరు విముఖత!
- కొన్నిచోట్ల కౌన్సిలర్‌లు, నాయకుల వత్తిడికి చేసేదిలేక రాజీనామాలు
- పార్టీ కోసం పనిచెయ్యాలని ఆదేశాలు

తెనాలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాల పర్వం మొదలయింది. సోమవారం వివిధ వార్డుల నుంచి 24 మంది వలంటీర్లు రాజీనామా చేశారనేది సమాచారం. అయితే వార్డుల వారీగా మూకుమ్మడి రాజీనామాలు అందకపోవటం, అక్కడక్కడ కొందరు మాత్రమే రాజీనామా చేస్తుండటం కొన్ని అనుమానాలకు కారణమవుతోంది. గడచిన పది రోజుల్లో వలంటీర్లందరితో ఒకసారి ఎమ్మెల్యే, తర్వాత ముఖ్యనేతలు, కౌన్సిలర్‌లు, పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి, వారి రాజీనామాలు కోరటం, వారిలో చాలామంది ముందుకు రాకపోవటంతో ఒక్క రాజీనామా కూడా లేకుండా ఇప్పటివరకు కొనసాగుతూనే వచ్చారు. అయితే కొన్ని వార్డుల్లో కౌన్సిలర్‌లు పనికట్టుకుని వత్తిడి తెచ్చి రాజీనామాలకు కొందరిని ఒప్పించారనేది సమాచారం. ఈ కోవలోనే తొలి రోజు 24 మంది రాజీనామాలు అందిస్తే మరికొందరు రానున్న రెండు రోజుల్లో రాజీనామాలు చేస్తారని చెబుతున్నారు. అయితే నిన్నటివరకు పవన్ కళ్యాణ్, చంద్రబాబు వలంటీర్లకు వ్యతిరేకమంటూ ప్రచారం సాగటం, వాటిని నమ్మటంతో వలంటీర్లంతా వైసీపీ నేతలు చెప్పిన మాట ప్రకారం నడుచుకుంటూ వచ్చారు. ఇప్పుడు కూడా వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నా, రాజీనామా చేయాలనే విషయంలో మాత్రం కొందరు విముఖంగా ఉన్నారనేది సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాజాగా చంద్రబాబు, పవన్‌లు తమ కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను తొలగించమని, మెరుగైన అవకాశాలు కల్పిస్తామంటూ చెప్పటంతో వాలంటీర్లకు ఆశలు చిగురించాయి. దీనికితోడు వలంటీర్ల ఒప్పంద గడువు మే నెలతో ముగుస్తుండటంతో రాజీనామా చేసినా, చేయకున్నా తమ కొలువు రద్దవుతుందనే విషయం తెలియటంతో ప్రభుత్వం తమను మోసం చేసిందని ఉన్నత విద్యావంతులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారనేది సమాచారం. రేపటి రోజున కూటమి ప్రభుత్వం వస్తే రాజీనామాలు చేసినందున తమకు అవకాశం కల్పించకుండా మరెవరినైనా తీసుకుటారేమోననే ఆందోళన ఒకపక్క ఉంటే, వైసీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనుకున్నా, వారు తమనే తిరిగి నియమించుకుంటారనే గ్యారంటీకూడా లేకపోవటంతో ఇప్పటివరకు రాజీనామాలు చేసే విషయంలో వలంటీర్లు తర్జనబర్జనలు పడుతూ వచ్చారు. చివరకు నాయకుల వత్తిడి పెరగటంతో చేసేదిలేక రాజీనామాలకే సిద్ధమయ్యారు. అయితే కొందరు మాత్రం స్వచ్ఛందంగానే రాజీనామా చేస్తున్నారని చెబుతుంటే, మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో రాజీనామా లేఖలను అధికారులకు అందిస్తున్నారనేది సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లో పట్టణంలోనే కాకుండా మండలంలోనూ మరిన్ని రాజీనామాలు పెరిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు.



ప్రత్తిపాడులో తాగు నీటి కోసం వైసీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

నీటి కోసం ఆందోళన

- ప్రత్తిపాడులో తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్థులు
- సాగర్ ద్వారా నీరు ప్రత్తిపాడు చెరువుకు అందని పరిస్థితి
- వారం రోజులుగా ప్రత్తిపాడులో నీటి సమస్య

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15: ప్రత్తిపాడు రక్షిత మంచినీటి చెరువుకు సాగర్ నీరు అందించాలంటూ అధికార పార్టీ రోడ్డెక్కింది. ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మొదలు పెట్టిన ఆందోళన ఉధృతంగా మారి ప్రత్తిపాడును పూర్తిగా అష్టదిగ్బంధనం చేసే పరిస్థితికి వచ్చింది. ప్రత్తిపాడు నుంచి ఒక్క వాహనాన్ని కూడా ముందుకు పోనీయకుండా మల్లాయపాలెం సెంటర్‌తో పాటు అంకమ్మగుడి సెంటర్‌లో కూడా బైఠాయించారు. మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా టెంటు వేసి ఆందోళన కొనసాగించారు. ఉదయం ప్రారంభమైన ధర్నా మధ్యాహ్నాం రెండు గంటల వరకు సాగింది.

నాగార్జున సాగర్‌కు చివరన ఉన్న ప్రత్తిపాడుకు సాగర్ కుడి కాలువ ద్వారా నీరు తీసుకురావడానికి గత నాలుగు రోజులుగా స్థానికులు కాలువమీదకు వెళ్లి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆదివారం సాయంత్రానికి ప్రత్తిపాడు వరకు నీటిని తీసుకురాగలిగారు. అయితే కొద్దిసేపటికే కొద్దిగా వచ్చే నీటి ప్రవాహం ఆగిపోయింది. ఈ క్రమంలో ఇక చివరన ఉన్న ప్రత్తిపాడుకు నీరు తీసుకురావడం తమ వల్ల కాదని బావించిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో వారితో మాట్లాడటానికి వచ్చిన అధికారులపై విరుచుకు పడ్డారు. కాలువకు నీరు పెట్టే బాధ్యత మీకు లేదా.. మీరు ఎందుకు ఇప్పటి వరకు పట్టించు కోలేదు.. అంటూ ప్రశ్నించారు. నాలుగు రోజుల పాటు నానా ఇబ్బందులు పడ్డాం.. మా మొర ఆలకించే వారే లేరు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక అధికారులకు ఏమి చెప్పాలో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారులు వచ్చి మా చెరువుకు నీరు వస్తాయి అని స్పష్టమైన హామీ ఇస్తే గాని ఇక్కడి నుంచి కదిలేది లేదని మహిళలతో పాటు గ్రామస్థులు పట్టుబట్టారు. ఎన్ఎస్‌బీ కెనాల్ ఈఈ ఎం.మురళీధర్ వచ్చి ఆందోళన చేస్తున్న వారికి నీరు అందించే బాధ్యత తనదని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఒక వేళ నీరు అందించలేకపోతే మీతో పాటే నేను కూడా ఇక్కడే ధర్నాలో కూర్చుంటాననడంతో ఆందోళనను విరమించారు.

ట్రాఫిక్ ఆగడంతో ఇబ్బందులు

గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ట్రాఫిక్ ఆగిపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండతో పాటు ఉక్కపోత ఉండటంతో సుమారు నాలుగు గంటల పాటు అలాగే బస్సులో వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఊరిలో నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడానికి కూడా అవకాశం లేకుండా రెండు దారుల్లో కూర్చోవడంతో పోలీసులు సైతం ఏమి చేయలేక పోయారు. చివరికి గుంటూరు వచ్చే వాహనాలను పుల్లడిగుంట, తిక్కిరెడ్డిపాలెం వద్దనే దారి మళ్లించే ఏర్పాట్లు చేశారు. పెదనందిపాడు వైపు నుంచి వచ్చే వాహనాలను గొట్టిపాడు రోడ్డువైపు మళ్లించే విధంగా ప్రత్తిపాడు సీఐ నిస్సార్ బాషా, ఎస్ఐ సోమేశ్వరరావులు చర్యలు తీసుకున్నారు.



చెరువుకు నీరు అందిస్తామంటూ హామీ ఇస్తున్న ఎన్ఎస్‌పీ కెనాల్ ఈఈ మురళీధర్

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం వైసీపీ కుయుక్తులు



- సచివాలయాల్లో క్రియాశీలకంగా ఉండే వారితో సంప్రదింపులు
- మేమే వచ్చేది అంటూ లొంగదీసుకొనే ప్రయత్నం
- ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఇప్పిస్తామని ప్రలోభాలు

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుండటంతో వైసీపీ వాటిని పొందేందుకు కుయుక్తులు పన్నడం ప్రారంభించింది. ఈ దఫా గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో దాదాపుగా 20 వేల నుంచి 23 వేలమందికి పైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసే అవకాశం ఉండటంతో వాటిని పొందేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ముఖ్యంగా సచివాలయాల్లో పని చేస్తున్న సెక్రెటరీలపై గురి పెట్టింది. మీకు ఉద్యోగాలు ఇచ్చింది మా ప్రభుత్వమే. రేపు ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చేది కూడా మేమే. దీని దృష్ట్యా పోస్టల్ బ్యాలెట్‌లో తమకు సహకరించాలని నేతల అనుచరులు సచివాలయాల్లో అందరితో కలుపుగోలుగా ఉండే వారితో మంతనాలు సాగిస్తున్నారు. ఒక్కో పోస్టల్ బ్యాలెట్ ఓటుకు రూ.3 వేలకు పైగా ఇప్పిస్తామని కూడా చెబుతున్నారు. ఎవరైతే సచివాలయంలో నేతృత్వం వహించి ఓట్లు వేయిస్తారో వారికి అదనంగా నజరానాలు ఇప్పిస్తామని ప్రలోభ పెడుతున్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులు ఫలాన ఉద్యోగులు పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో ఉంటారని వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేయాలని కలెక్టరేట్ లీగల్ సెల్‌కి రిక్విజిషన్‌లు పంపుతున్నారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియని చేపడతారు.

ఈ నేపథ్యంలో ఎక్కువ సమయం లేకపోవడంతో ఎవరైతే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియో గించుకొంటారో వారి వివ రాలను వైసీపీ సేకరిస్తు న్నది. సచివాలయాల ఉద్యోగులందరికి ఓపీవో డ్యూటీలు వేస్తున్నారు. దీంతో వారంతా పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులౌతారు. సచివాలయాల వారీగా వైసీపీ నేతలు వెళ్లి అడ్మిన్ సెక్రెటరీలను కలుస్తున్నారు. వారితో గతంలోనే పరిచయాలు ఉండటంతో ఫలాన అభ్యర్థి తమని పంపించారని, మిమ్మల్ని కలవమన్నారని చెప్పి సచివాలయంలో ఉండే ఉద్యోగులందరితో పోస్టల్ బ్యాలెట్ ఓటు ఎలాగైనా వైసీపీకి వేయించేలా చూడాలని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అలానే ఇతర శాఖల్లో అసోసియేషన్ల నాయకులతోనూ మంతనాలు సాగి స్తూ ప్రలోభాలకు తెర లేపారు. దీనిపై ఈసీ నిఘా పెట్టాలని ప్రతి పక్షాలు కోరుతున్నాయి.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ఉద్యోగులు

జీరో రీపోల్ లక్ష్యం

- శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15: ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళగిరిలో నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రిసైడింగ్ అధికారులకు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు (ఏపీఓ) మొదటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి అదేవిధంగా గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ లక్ష్యమైన జీరో రీపోల్ సాధించాలంటే ఎన్నికలరోజు పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు. శిక్షణ కార్యక్రమాలను మరింతగా వివరించేందుకు వీడియోల ద్వారా, ఈవీఎం యూనిట్లను కమిషనింగ్‌పై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. అనంతరం మంగళగిరిలోని నిర్మల కాన్వెంట్‌లో ఈవీఎం యూనిట్లు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకర్గ ఏఆర్వోలు డీసీపీ ఎన్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, మంగళగిరి తహసీల్దారు వేంకటేశ్వర రావు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు పలువురు పీవోల డుమ్మా

- సీరియస్‌గా తీసుకొన్న జిల్లా ఎన్నికల అధికారి

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పోలింగ్ రోజున విధులు నిర్వహించాల్సిన పీవో(పోలింగ్ ఆఫీసర్ల)కు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు పలువురు గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాలలో ఈ శిక్షణ తరగతులను రిటర్నింగ్ అధికారులు ఏర్పాటు చేయగా దాదాపుగా అన్ని చోట్ల పలువురు పీవోలు హాజరు కాలేదు. సాయంత్రానికి పీవోల హాజరుని తెప్పించుకొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఎలాంటి అనుమతి తీసుకోకుండా గైర్హాజరయ్యారో వారికి షోకాజ్ నోటీసులు పంపాలని ఆదేశించారు. 24 గంటల వ్యవధిలో సంజాయిషీ ఇవ్వకుంటే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద కఠినమైన క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేయాలని ఆర్‌వోలను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో గైర్హాజరైన పీవోలు తత్తరపాటుకు గురౌతున్నారు. ఆర్‌వోలకు వివరణ ఇచ్చేందుకు కారణాలను వెతుకుతున్నారు. ఈ విషయం ఎన్నికల సంఘం దృష్టికి వెళితే సస్పెన్షన్ చర్యలు తీసుకొనే అవకాశం కూడా లేకపోలేదు.

తాగునీటికి కటకట

- తక్షణమే నీరు విడుదల చేయాలి
- నాదెండ్ల మండల వాసుల డిమాండ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: తాగునీటి కోసం తుర్లపాడు మేజరుకు నీరు విడుదల చేయాలని నాదెండ్ల మండల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయం వద్ద నాదెండ్ల మండలం వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, అప్పాపురం, ఎండుగుంపాలెం గణపవరం, కనపర్తి, సాతులూరు చెరువులు పూర్తిగా ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఒక్కసారి కూడా పూర్తిగా చెరువులు నింపలేదన్నారు. ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకోవడం తప్ప మంచినీరు మాత్రం ఇవ్వలేదన్నారు. నాదెండ్ల మండ లం నుంచి పోయే తుర్లపాడు మేజరు ద్వారా 8 గ్రామాలకు తాగునీరు అందు తుందన్నారు. తక్షణమే తుర్లపాడు మేజరుకు నీరు విడుదల చేసి చెరువులు నింపి ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాదెండ్ల మండలం అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాదెండ్ల మండల ప్రజలు

పోలీసులు తర్జనభర్జనలు

పవన్‌పై రాయి కలకలం ఘటనలో..

తెనాలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి కార్యక్రమంలో ఓ యువకుడు రాయి విసిరాడంటూ వచ్చిన వార్తల కలకలం అంశంపై పోలీసులు తర్జనభర్జన పడుతున్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో పవన్‌కల్యాణ్ ర్యాలీ జరుగుతున్న సమయంలో ర్యాలీకి వచ్చిన యువతులకు ఓ యువకుడు తగలడం.. ఓ యువతి తండ్రి అతడిని నిలదీసే క్రమంలో పవన్‌పై రాయి విసిరారంటూ ఆ యువకుడిని పవన్ అభిమానులు పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే ఈ సంఘటనపై జనసేన వర్గాల నుంచి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ ఘటనకు సంబంధించి ఓ ముగింపు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ సంఘటనకు సంబంధించి యువకుడు కాని, యువతి తరుపున వారు గాని ఫిర్యాదు ఇచ్చేందుకు ఎవ్వరూ సుముఖంగా లేకపోవడంతో కొత్తచిక్కువచ్చిపడింది. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి సోమవారం వరకూ పోలీసులు అందుబాటులో ఉన్న సీసీ టీవి ఫుటేజ్‌లను, సంఘటన సమయంలో అక్కడ ఉన్న వారిని పలు దఫాలుగా విచారించారు. అయితే ఎక్కడా రాయి విసిరిన ఆరోపణ కాని చూసినట్టుగాని ఎవ్వరూ చెప్పలేదని యువతి తండ్రి కూడా పొరపాటున యువకుడు తగిలిన విషయంలోనే చిన్నపాటి ఘర్షణ జరిగిందే కాని రాయి విసరడం వంటి పరిస్థితులను తాము కూడా చూడలేదని చెప్పారు. అయితే రాత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చేందుకు మాత్రం ఇష్టపడలేదని డీఎస్పీ రమేష్‌బాబు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి ఏ ఫిర్యాదు లేకపోవడం వల్ల దీనిపై ఎట్లా ముందుకు వెళ్లాలనే విషయాన్ని న్యాయనిపుణులతో సంప్రదించి వారి సూచనల ప్రకారం నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.

ఎన్నికల విధులపై శిక్షణ



ఏసీ కాలేజీలో పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 15: ఎన్నికల విధులపై అందిస్తున్న శిక్షణను శ్రద్ధగా అవగాహన చేసుకుంటే పోలింగ్ సాఫీగా నిర్వహించడానికి వీలు కల్గుతుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన పీవోలు, ఏపీవోలకు సోమవారం స్థానిక ఏసీ కళాశాలలో జరుగుతున్న తొలివిడత శిక్షణను కమిషనర్ పరిశీలిం చి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ శిక్షణలో వీడియో క్లిప్పింగ్స్, డెమో ఈవీఎం లు, వీఈ ప్యాట్‌లు, మాక్ పోల్, ఫారం-17సీ, పీవో డైరీ, ఇతర ఫారాలు నింపడం వంటి కీలక అంశాలు వివరించడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల నుండి పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఫారం-12ని సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, ఏఈఆర్ఓ వెంకట లక్ష్మి, డీఈఈ రమేష్‌బాబు, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్లపై మద్యం ప్రభావం పడకూడదు

- మద్యం అక్రమ రవాణా, నిల్వలపై దృష్టి సారించాలి
- సెబ్ నేర సమీక్షలో అదనపు ఎస్పీ వెంకటేశ్వరావు



నేర సమీక్ష నిర్వహిస్తున్న సెబ్ అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు

గుంటూరు, ఏప్రిల్ 15: జిల్లాలో ఓటర్లపై మద్యం ప్రభావం చూప కుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సెబ్ అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌హౌస్ అధికారులు, ఉన్నతాధికారులతో ఆయన నేర సమీక్ష నిర్వహించారు. సెబ్ అదనపు ఎస్పీ మాట్లాడుతూ మద్యం మద్య రహిత ఎన్నికల కోసం అధికారులు, సిబ్బంది, నిరంతరం కృషి చేయాలన్నారు. మద్యం నిల్వలు, ఇతర రాష్ట్రాల మద్యం, మత్తు పదార్థాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేకుండా విధులు నిర్వహించాలన్నారు. గంజాయి విక్రేతకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించిన కేసులో సమర్థవంతంగా దర్యాప్తు, సాక్షు లను ప్రవేశపెట్టిన అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినం దించారు. మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన బుల్లయ్య అనే వ్యక్తి వద్ద 21.1 కేజీల గంజాయి ఉన్నందుకు గాను నమోదైన కేసులో ముద్దాయికి గుంటూరుజిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1లక్ష జరిమానా విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు పూర్తిచేసి, కోర్టు విచారణకు సాక్షులను త్వరితగతిన ప్రవేశపెట్టిన గుంటూరు-1 సెబ్ సీఐ లత, కోర్టు కానిస్టేబుల్ కోటేశ్వరరావులకు ప్రత్యేక రివార్డు కోసం సిఫార్సు చేశారు. పెండింగ్ కేసులు, గ్రేవ్ క్రైమ్ కేసులు, గంజాయి తదితర మత్తు పదార్థాల కేసుల దర్యాప్తుపై తగిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో సెబ్ అధికారులు కృష్ణ కిశోర్‌రెడ్డి, విజయ్ కుమార్ (ప్రత్తిపాడు), మాధవి (మంగళగిరి). ప్రసన్న లక్ష్మీ (తెనాలి), చలం (పొన్నూరు), సుకన్య, ప్రభుదాసు, ఇంటెలిజన్స్ శకుంతలదేవి, టెక్నికల్ వింగ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో.. అడుగడుగునా బ్రహ్మరథం

- రాజధాని గ్రామాలలో పెమ్మసాని , శ్రావణ్ ప్రచార హోరు
- వైసీపీ మండల అధ్యక్షుడు టీడీపీలో చేరిక



పెదపరిమిలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రచారంలో పాల్గొన్న రాజధాని గ్రామాల మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 15: రాజధాని గ్రామాల్లో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలుజల్లి హారతులిచ్చారు. బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. సోమవారం పెదపరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాల్లో ఇద్దరు ప్రచారం నిర్వహించారు. అనంతవరంలో పలు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. పెమ్మసాని పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత పెదపరిమి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. తుళ్లూరు మండల వైసీపీ అధ్యక్షుడు మాదల మహేంద్రకు పెమ్మసాని, శ్రావణ్‌కుమార్‌లు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతవరంలో గ్రామస్తులు మధ్యాహ్న భోజనం పార్టీ శ్రేణులకు ఏర్పాటు చేశారు. అనంతరం వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాలలో ప్రచారం జోరు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, అమరావతిని ర క్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని స్పష్టం చేశారు. కోడి కత్తి, బాబాయి హత్య గతంలో ఎన్నికల ప్రచారంలో వాడుకొని సెంటిమెంట్ సీఎం జగన్‌రెడ్డి పండించారన్నారు. ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. ఇప్పుడు సరికొత్తగా రాళ్ల దాడి ఘటన తెరమీదకు వచ్చిందన్నారు. ప్రతి పక్షంపై బురద జల్లే కార్యక్రమం జగన్‌రెడ్డి మొదలు పెట్టాడన్నారు. రాయి దాడిపై నిష్పక్షపాతంగా ఎంక్వయరీ జరగాలన్నారు. ఒక్క ఛాన్స్ అని రాజధాని అమరావతి తో సహా రాష్ట్రాన్ని అధోగతి పాలు జేశారన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ఇవ్వటాన్ని ఎవరూ కాదనరు అన్నారు. పేదల జీవితాలు బాగుపడాలంటే రోజు వారి సంపాదన చూపించాలన్నారు. నెలకు రూ.50 వేలు సంపాదించే ఉపాధిని పేదలకు చూపాలన్నారు. అప్పుడే వారి జీవితాల్లో భరోసా నిండుకుంటుందన్నారు. అంతేకాని పావల సంక్షేమం ఇచ్చి, పన్నుల రూపంలో రూపాయి కాజేయటంతో పేదల జీవితాలు ఆర్థికంగా ఎలా ఎదుగుతాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదలు సంపన్నులు అవుతారన్నారు. చంద్రబాబు సంక్షేమంతో పాటు పేదలకు నిరంతరం ఉపాధి చూపే నాయకుడన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని పెమ్మసాని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 25వేల కిలోమీటర్లు సిమెంట్ రోడ్డు టీడీపీ ప్రభుత్వంలో వేశామని చెప్పారు. ఈ వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల దోచుకుంటూ ఉందన్నారు. టీడీపీకి ఓటు వేసి అమరావతిని రక్షించుకోవాలని కోరారు.

ఆయా గ్రామాల ప్రచార కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, రైతు నాయకులు నూతలపాటి రామారావు, జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, సరిపూడి సాంబశివరావు, టీడీపీ నేతలు చుండు వెంకటరెడ్డి, పోతుగుంట నర్సయ్య, భాష్యం పెదశ్రీధర్, చినశ్రీధర్, కర్నాటి శ్రీనివాసరావు, రావెల గోపాలకృష్ణ రామినేని చిన్నా, పోలు నర్సయ్య, జొన్నలడ్డ మధు, అనంతవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండ్ల సూరిబాబు, మద్దినేని రాంబాబు, గోరిజాల శ్రీనిసరావు, కాటా అప్పారావు, జమ్ముల అనిల్, సరిగల డేవిడ్, చిలకా బసవయ్య, తరిగోపుల సాంబశివరావు, వట్టికూటి బాబీ, మాజీ ఎంపీటీసీలు షైనేని గిరిజా, జొన్నలగడ్డ కిరణ్ పిన్నక సాంబశివరావు, జొన్నకూటి ఏడుకొండలు, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, గ్రామాల టీడీపీ అధ్యక్షులు అత్తిపట్ల బాలయ్య, పుచ్చకాయల గిరి, కొమ్మినేని కోటేశ్వరావు, కట్టానరసింహరావు, జనసేన, బీజేపీ , టీడీపీ కార్యకర్తలు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు అభ్యర్థులు పూలదండలు వేసి నివాళి అర్పించారు.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతిని అవమానించిన వారిని తరిమికొట్టాలి

- 1581వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్15: రాజధాని అమరావతిని భక్షించాలనుకునే వారిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1581వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు, రైతులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధి పనులు దాదాపు రూ.9వేల కోట్లు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తట్ట మట్టి వేయలేదన్నారు. అమరావతిపై అబాండాలు, అసత్య ప్రచరాలు చేస్తూ నాశనం చేయాలని సీఎం జగన్‌రెడ్డి అండ్‌కో చూసిందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో భూములు ఇచ్చిన రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: తనపై నమ్మకంతో పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా ఎంపిక చేసిన తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఓ ప్రకటనలో హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఏడు శాసన సభ స్థానాల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి నారా చంద్రబాబునాయుడు శాసనసభ సాక్షిగా చేసిన ప్రతిజ్ఞ నెరవేరుస్తామన్నారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేసిన పల్నాడు జిల్లా నాయకులకు కార్యకర్తలకు ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తాం

- మాజీ మంత్రి ప్రత్తిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 15: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తామని మాజీమంత్రి, ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో లక్షకు పైగా జనాభా ఉన్న వారందరికీ 80 సంవత్సరాలు ఎదురుచూపులకు పరిష్కారం చూపిస్తామన్నారు. సోమవారం పట్టణంలోని వివేకానంద కాంప్లెక్స్‌లో జరిగిన తిరుమలై కల్లర్ కులస్తులతో ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటితో పాటు స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారంతా తమిళనాడు నుంచి వచ్చి రాష్ట్రంలో సుమా రు 80 సంవత్సరాలుగా జీవిస్తు న్నామని, ఏపీ ప్రభుత్వం తమ కు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరుచేయటం లేద ని, పిల్లలను పాఠశాలలో చే ర్పించాలన్నా, సంక్షేమ పథకా లకు దరఖాస్తులు చేసుకోవాల న్నా గుర్తింపులేక ఇబ్బంది పడుతున్నామని వారు ప్రత్తి పాటి, లావు దృష్టిలకు తీసుకు వచ్చారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ రాబోయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మీకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పల్నాడును.. సస్యశ్యామలం చేస్తాం

- సాగర్ కుడికాలువను స్థిరీకరణ చేస్తాం
- ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందిస్తా
- పిన్నెల్లి బాధితులను గుండెల్లో పెట్టుకుంటా
- ఆత్మగౌరవ సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, ఏప్రిల్ 15: పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే వరికపూడిశల ప్రాజెక్టు మంజూరు చేయించానని, అదేవిధంగా 2024 ఎన్నికల అనంతరం కృష్ణానదిపై మూడు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించి పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరా యలు పల్నాడు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జరిగిన ప్రజాగళం - ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడు తూ కొంతమంది అణగదొక్కాలని చూస్తున్నారని, దానికి రెండు రెట్లు వేగంతో నిప్పులు తొక్కుకుంటూ పైకి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తారనేదానికి నిదర్శనం పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనమని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పిన్నెల్లి గ్రామంలో 2019 ఎన్నికల తరువాత వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు, అకృత్యాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటమే కాకుండా భూములను బీడు భూములుగా మార్చారని ఆరోపించారు. పిన్నెల్లి వైసీపీ బాధితులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి ఏర్పాటు చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు సిలిండర్లు ప్రకటిస్తే యరపతినేని శ్రీనివాసరావు ఒక సిలిండర్ ప్రకటించారన్నారు. ముఖ్యంగా మైనారిటీ సోదరులకు బీజేపీతో కలవడం వల్ల 4 శాతం రిజర్వేషన్‌కు ఇబ్బంది కలుగుతుందనే అపోహలో పడవద్దని, రిజర్వేషన్‌కు ఎలాంటి ఇబ్బంది వుండదని తేల్చిచెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసేందుకు కూడా బీజేపీ సంసిద్ధంగా వుందన్నారు. రాష్ట్రం బాగుపడాలనే ఉద్ధేశంతో బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జంగా కృష్ణమూర్తి రాష్ట్రవ్యాప్తంగా తిరిగితే వైసీపీ నేడు ఆయనకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. డబ్బు అనే అహంకారంతో కాసు మహేష్‌రెడ్డి వున్నాడని, ఎల్లప్పుడూ డబ్బు సమస్యకు పరిష్కారం కాదని హితవు పలికారు. పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనాన్ని చూసి శ్రీకృష్ణదేవరాయలు భావోద్వేగానికి గురయ్యారు.

అభివృద్ధి తప్ప కక్ష సాధింపు వుండదు : ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ పాలనలో పిన్నెల్లి రావణకాష్టంగా మారిందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సభలో మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అహంకారానికి.. టీడీపీ అభివృద్ధికి మధ్య జరిగేవని, 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా పిన్నెల్లి వచ్చినప్పుడు అప్పుడు అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపించిందని, టీడీపీ హయాంలోనే పిన్నెల్లిని ఎంతో అభివృద్ధి పథంలో మార్చుతెచ్చామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పిన్నెల్లిలోనే 40 మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టి మహిళలపై అత్యాచారాలు, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ బీసీ కాపు సామాజికవర్గానికి చెందిన 11మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రోద్బలంతో హత్యలు చేశారని, కాసు అక్రమ సంపాదన కోసం ముక్కుపచ్చలారని 8మంది చిన్నారులు బలయ్యారన్నారు.ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడమే కాకుండా ప్రైవేటువ్యక్తుల పొలాలను కూడా ఆక్రమించుకున్న వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాసు అండదండలు పుష్కలంగా వున్నాయన్నారు. పల్నాడులో మాకు మాకు మధ్య తగాదాలు పెట్టడం కాసు మహేష్‌రెడ్డికి తగదని, సంపాదనే కావాలంటే నావద్ద వున్నవి ఇస్తాను.. అవి కూడా చాలకపోతే జోలెపట్టి అయినా నీకు అందజేస్తానని, ఇకనైనా అక్రమ సంపాదన కోసం ఏ ఒక్కరిని బలి తీసుకోవద్దని యరపతినేని సూచించారు. నేను, జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేలుగా వున్న సమయంలో పల్నాడు అభివృద్ధికి తపన పడ్డామే కానీ గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోలేదన్నారు. నరసరావుపేట, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కాసు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అంతా గురజాల సొమ్ముతోనే కాదా అని యరపతినేని ప్రశ్నించారు. రేపు రానున్న ప్రజా ప్రభుత్వంలో పిన్నెల్లి అభివృద్ధి కోసం 50 కోట్ల రూపాయలు కేటాయిస్తాను. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పిన్నెల్లి ఘటనలు నా మనసును ఎంతో కలచివేసిందన్నారు. ఉంటున్న ఊరు, కన్నతల్లిని వదిలి ఐదేళ్లు ఎక్కడెక్కడో వుండాల్సిన పరిస్థితి ఏ ఒక్కరికి రాకూడదన్నారు. నేను, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జంగా కృష్ణమూర్తిలు పిన్నెల్లిని అభివృద్ధి చేసి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని, రేపటి ఎన్నికలలో ప్రతిఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలన్నారు.

యరపతినేని గెలుపు నల్లేరుమీద నడకే: జంగా కృష్ణమూర్తి

రాష్ట్రంలో వైసీపీ అధికారంలో వుందనే అహంకారంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కిందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. పల్నాడు ప్రాంతంలో ఎన్నడూ లేనివిధంగా అక్రమ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయలు అక్రమ సంపాదన చేసుకొని రానున్న ఎన్నికల్లో డబ్బుల సంచులతో గ్రామాలలోకి వస్తున్నారని, డబ్బులు వైసీపీ వారివద్ద తీసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. ఒకప్పుడు యరపతినేని, నేను ప్రత్యర్థులమైనప్పటికీ పల్నాడు అభివృద్ధికే ప్రణాళికలు రూపొందించుకున్నాము తప్ప కక్షలు, కార్పణ్యాలను ప్రోత్సహించలేదన్నారు. నేడు మైనింగ్‌లకు గోరంత పర్మిషన్ తీసుకొని కొండంత దోపిడీ ఎమ్మెల్యే కాసు చేస్తున్నాడని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అనుమతి తీసుకొచ్చారని, దాని ద్వారా పల్నాడు ప్రాంతం సస్యశ్యామలంగా మారనున్నదన్నారు. గత ఎన్నికలలో నా సీటు కాసు మహేష్ రెడ్డికి త్యాగం చేస్తే నా సొంత గ్రామంలో కూడా మాకు పనులు కాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తారని ఆరోపించారు.

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపాం..

- తెలంగాణ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపామని.. ఏపీలో తిక్కోడిని కూడా మీరందరూ ఇంటికి పంపాలని తెలంగాణ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు. పిన్నెల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పరదాల మాటున ఐదేళ్లు గడిపిన జగన్‌రెడ్డి రేపటి ఎన్నికల తరువాత పూర్తిగా ఇంటికే పరిమితమవుతారన్నారు. 2014లో నాన్న లేడని.. 2019లో చిన్నాన్న లేడని... 2024లో తల్లీ, చెల్లీ లేరని నర్సిరెడ్డి వ్యాఖ్యానించారు. గంజాయి, అక్రమ సంపాదన, కౌలు రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలతో రాష్ట్రం మొదటి రెండు స్థానాలలో నిలిచిందన్నారు.



పావురాళ్లను ఎగురవేస్తున్న యరపతినేని, శ్రీకృష్ణదేవరాయలు, జంగా, నర్సిరెడ్డి తదితరులు



సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

జగన్‌కు రేపటి ఎన్నికలలో ఓటమి ఖాయమేనని నర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కర్నాటి వరలక్ష్మీ, జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అమీర్‌అలి, మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, దున్నా చెన్నయ్య చౌదరి, యడ్లపల్లి రామారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, కొల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చింతపల్లి నన్నే, తాళ్లూరి అమర్‌నాథ్, యరవెద రామిరెడ్డి, పలు గ్రామాల దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

18న లావు శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్



శ్రీకృష్ణదేవరాయలు డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, ఏప్రిల్ 15: నరసరావుపేట లోక్‌సభ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కలెక్టరేట్‌లోని పార్లమెంట్ నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు, ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి భారీగా కూటమి శ్రేణులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

211 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్



రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 15: నియోజకవర్గంలోని 211 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రత్యేక్ష ప్రసారం ద్వారా ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 299 పోలింగ్ కేంద్రాలుండగా ఆయా చోట్ల ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంలు అదనంగా 40 శాతం తీసుకొచ్చామన్నారు. విజయపురిసౌత్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రూ.లక్ష పట్టుకున్నామని చెప్పారు. సోమవారం కూడా రూ.4.50 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. ఈవీఎంలను పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో భద్రపరిచామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంకు సంబంధించి వేరే రాష్ట్రాల్లో పనిచేస్తున్న 110 మందికి ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ పంపిస్తున్నామని, కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటలకల్లా మాకు అందితే ఓట్లు లెక్కిస్తామని అన్నారు. ఎన్నికల విధులు అతిక్రమించిన 8మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 19వ తేదీన ప్రధాన అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉందని, ఎవరికీ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, ఎలక్షన్ డీటీ బాషా తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తాం..

- ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందిస్తాం
- ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు



తాళ్ళచెరువులో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, పక్కన భాష్యం ప్రవీణ్ తదితరులు

అచ్చంపేట, ఏప్రిల్ 15: ఇంటింటికీ వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. సోమవారం తాళ్ళచెరువు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తానని తెలిపారు. ఎత్తిపోతల పథకాలు మూలన పడ్డాయని, ఎన్నికల అనంతరం వాటికి మరమ్మత్తులు చేపట్టి వందలాది ఎకరాలు సాగులోకి తీసుకు వస్తాన న్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలు మళ్ళీ పునరుద్ధరించి ఎస్సీల అభ్యున్నతికి బాటలు వేస్తానని ఎంపీ తెలిపారు. అధికారంలోకి రాగానే అర్హులైన వారికి రెండు సెంట్ల నివేశన స్థలంతో పాటు ప్రభుత్వం గృహం కూడా మంజూరు చేస్తామన్నారు. బీసీ డిక్లరే షన్ ద్వారా బీసీల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో ఎస్సీ వర్గీకరణ గురించి వివరిం చాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని సాగు, తాగు నీరు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చే యాలని, బూత్ లెవల్ కమిటీలు జాగ్రత్త వహించాలన్నారు. సమష్టిగా పనిచేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి, వెన్నా సాంబశివా రెడ్డి, నల్లమేకల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంగళరెడ్డి, మద్దిరాల గంగా ధర్ తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలో సర్పంచ్ రామావత్ కోటేశ్వర నాయక్ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. పది కుటుంబాల వారు కండువాలు కప్పుకున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది పార్టీలోకి వస్తారని కోటేశ్వరరావు నాయక్ తెలిపారు.

పాత టైర్ల ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న పాత టైర్ల ఫ్యాక్టరీ

నాదెండ్ల, ఏప్రిల్ 15: చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలోని అప్పాపురం డొంక పక్కన తిరుమల పాలిమర్ ప్రొడక్ట్స్ కంపెనీ ఫ్యాక్టరీలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు కోటి రూపాయలకు పైగా ఆస్థి నష్టం సంభవించినట్టు అంచనా. పక్కనే పొలాల్లోని రైతులు పత్తి కట్టెను తగల బెట్టడంతో నిప్పు రవ్వలు ఎగసి పడి ఈ టైర్ల ఫ్యాక్టరీకి అంటుకున్నాయి. మంటలు తీవ్రంగా ఎగసి పడటంతో రెండు గోడౌన్‌లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చిలకలూరిపేట, నరసరావుటలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ సందర్శించారు. చిలకలూరిపేట, నరసరావుపేట ఎస్ఎఫ్‌వోలు ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి, సుబ్బారావు ఆధ్వర్యంలో రాత్రి వరకు మంటలను ఆర్పుతూనే ఉన్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



అలవాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

రొంపిచర్ల, ఏప్రిల్ 15: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ బిందుమాధవ్ సోమవారం పరిశీలించారు. గోగుల పాడు, అలవాల గ్రామాల్లోని 41, 42, 43, 44, 45 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్య లు ఉంటే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వర్మ, సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రవీంద్రలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.04
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

1,22,620 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,32,603 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,22,620 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 84,395 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	8500	15000
273	9500	14000
341	9000	15000
4884	8500	13000
సూపర్ 10	9000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	8000	14500
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అభిమానులు, కార్యకర్తలతో కేక్ కట్ చేస్తున్న తాడిశెట్టి మురళీమోహన్ తదితరులు

పదవి బాధ్యతను మరింత పెంచింది

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్

గుంటూరు, ఏప్రిల్ 15: పదవి అలకారప్రాయం కాదని, బాధ్యతలను మరింత పెంచిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడిశెట్టి మురళీ మోహన్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా తాడిశెట్టి మురళీ మోహన్ నియమి తులైన నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి ఆయన అభిమానులు, అనుచరులతో పాటు కూటమిలోని నేతలు సోమవారం పట్టాభిపురంలోని ఆయన ఇంటికి చేరుకుని పుష్ప గుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మురళీమోహన్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని ఓడించేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమికి అండగా నిలవాలని, రానున్న ఎన్నికలకు సమష్టిగా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం బాగుండాలంటే జగన్ పోవాలి.. కూటమి అధికారంలోకి రావాలని పునరుద్ఘాటించారు. జిల్లాలో కూటమి అభ్యర్థులందరిని గెలిపించి చంద్రబాబుకి బహుమతిగా ఇవ్వాలని మురళి మోహన్ పిలుపునిచ్చారు.

మురళి సమక్షంలో భారీగా వైసీపీ శ్రేణులు టీడీపీలోకి....

టీడీపీ నేతల జుటూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో కుర్నుతల గ్రామం నుంచి 50 కుటుంబాలు, మాల మహానాడు నేత దేవి ఆధ్వర్యంలో వైసీపీ చెందిన పలువురు మహిళలు, నెహ్రూనగర్ నుంచి జ్యోతిరాజ్ ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, నగరంపాలెం, సంపత్ నగర్ నుంచి పలువురు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మురళి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, కార్పొరేటర్ శ్రీవల్లి, మాజీ కార్పొరేటర్లు అడపా కాశీ విశ్వనాథం, సంబరాసు వాసు, నేతలు సుబ్బారావు, అంకమ్మరావు, శ్రీను నాయక్, గోపిరామ్, దుర్గ, శేషగిరి, శ్రీకాంత్, శివా, మాల్యాద్రి, రాజు, ప్రభ కిరణ్, రాకేష్, రేవంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పెమ్మసాని, గల్లా మాధవి, మద్దిరాల మ్యానీ తదితరులు

ముగిసిన సువార్త ఉజ్జీవ మహాసభలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15: కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక నల్లపాడు రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద జరుగుతున్న 18వ సువార్త ఉజ్జీవ మహాసభలు ఆదివారం అర్ధరాత్రితో ముగిసాయి. ముగింపు సభలకు ఎన్డీఏ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, టీడీపీ నేతలు మద్దిరాల మ్యానీ, రాష్ట్ర సమాచార కమీషనర్ శ్యామూల్ జోనాథన్ హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. చివరిరోజున ఉదయపు ప్రార్థనను పాస్టర్ డేవిడ్‌రాజు ప్రారంభించగా, చివరి ప్రార్థన బ్రదర్ మాథ్యూస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా అండమాన్‌కు చెందిన పాస్టర్ రాజు వ్యాఖ్యోపదేశం చేసి, విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

దుష్ట శిక్షణ కోసమే రామావతారం

● ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15: మహావిష్ణువు దశావతారాలలో ఏడోవది రామ అవతారమని, దుష్ట శిక్షణ కోసం రాముడిగా మానవ రూపంలో జన్మించారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీరాముని జన్మ వృత్తాంతంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రీరంగనాయకి ప్రవచిస్తూ శ్రీరాముడు రాముడు చైత్ర మాసం శుక్లపక్షంలో తొమ్మిదవ రోజున కర్కాటక లగ్నం, పునర్వసు నక్షత్రంలో జన్మించాడన్నారు. పునర్వసు నక్షత్రంలో జన్మించిన వారికి భగవంతుడిపై అపారమైన విశ్వాసం ఉంటుందని జ్యోతిష్యులు చెబుతారన్నారు. పునర్వసు నక్షత్రంలో పుట్టిన వారి ప్రవర్తన చిన్నప్పటి నుంచి చాలాసౌమ్యంగా, సున్నితంగా ఉంటుందన్నారు. శ్రీరాముడు సీతా సమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడు అయినది కూడా చైత్ర శుద్ధ నవమి నాడే జరిగిందని వివరించారు.

ఆలయంలో మంత్రి రజనీ ప్రత్యేక పూజలు

గుంటూరు, ఏప్రిల్ 15: పట్టాభిపురం, పాత గ్లూకోజ్ ఫ్యాక్టరీ రోడ్డులో సోమవారం మహాగణపతి, సాయినాథుని వాయుప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి మంత్రి విడదల రజిని హాజరై ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురు వైసీపీలోకి.. పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం పలువురు మంత్రి రజినీ సమక్షంలో వైసీపీలో చేరారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీడీపీకి చెందిన 30 కుటుంబాలు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ఝాన్సీ ఆధ్వర్యంలో కన్నావారితోట నుంచి 30 మంది మహిళలు వైసీపీలో చేరారు. వారందరికీ మంత్రి రజిని స్వాగతం పలికారు.

అవినీతి ప్రభుత్వానికి త్వరలో తిలోదకాలు

● పెమ్మసాని చంద్రశేఖర్, గళ్ళా మాధవి
● పశ్చిమ నియోజకవర్గ జనసేన నేతల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, మాధవి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అవినీతి, అరాచక ప్రభుత్వానికి ప్రజలు తిలోదకాలు ఇస్తారని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జనసేన కార్యాలయంలో జనసేన పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన పశ్చిమ నియోజకవర్గ జనసేన నేతల సమావేశం జరిగింది. సమావేశంలో గుంటూరు పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గళ్లా మాధవి, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ హాజరయ్యారు. సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ వారాహి యాత్ర ప్రభంజనం ద్వారా ఎన్డీఏ కూటమి లక్ష్యాలు మరోసారి ప్రజల్లోకి బలంగా వెళ్లాయన్నారు. అవినీతితో నిండి పోయినప్రభుత్వానికి ప్రజలు త్వరలో తిలోదకాలివ్వనున్నారన్నారు. బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గల్లా మాధవిలతో కలిసి రాబోయే 25 రోజుల ఎన్నికల పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకుని, ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గల్లా మాధవి మాట్లాడుతూ మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్న ఫలితాలు వారాహి యాత్రలో స్పష్టమయ్యాయని అన్నారు.చిన్నచిన్న సమస్యలు ఏమైనావుంటే పరిష్కరిం చుకుంటామన్నారు. బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెనాలిలో జరిగిన వారాహి యాత్ర దిగ్విజయానికి సహకరించిన మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. జగన్ ప్రయత్నించిన రాయి దాడి డ్రామా ఫెయిల్ అవ్వడంతో ఇప్పుడు చంద్రబాబు, పవన్‌పై రాళ్ల దాడి చేయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, జనసేన నాయకులు ఆళ్ళ హరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు కృషిచేస్తాం : పెమ్మసాని

రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. గుంటూరు అమరావతి రోడ్డులోని ఏ-వన్ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగిన పశ్చిమ నియోజక వర్గం నిరుద్యోగ యువత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ లాగా తాడేపల్లి ఇంట్లో కూర్చొని కబుర్లుచెప్తే పరిశ్రమలు రావు అన్నారు. పరిశ్రమలు తీసుకురావడం అంటే పేపర్లపై సంఖ్యలు చదవడం కాదని విమర్శించారు. పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరపాలి, బతిమాలాలి, వాళ్లకు భరోసా కల్పించాలన్నారు. చంద్రబాబు నాయుడు ఐదేళ్లు కష్టపడి 120సంస్థలను రాజధానికి తీసుకురావడానికి కృషిచేశారని, స్థలాలు కేటాయించి, జీవోలు కూడా విడుదల చేశారని చెప్పారు. జగన్ ఆ సంస్థలను, పరిశ్రమలను రాజధానికి రాకుండా రద్దుచేశారని మండిపడ్డారు. గళ్లా మాధవి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత తమ సత్తా చాటాలన్నారు. ఇప్పటికే నిరుద్యోగ భృతిని ప్రకటించిన టీడీపీ అధికారంలోకి రాగానే పరిశ్రమలను తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం హరిబాబు, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెమ్మసాని, గళ్ళామాధవి

కూటమి విజయంతోనే ప్రజా ప్రభుత్వం

● తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్
● 55, 56 డివిజన్‌లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
● వైసీపీ నేతలు పలువురు టీడీపీలోకి చేరిక



ప్రజాదీవెన యాత్రలో మొహమ్మద్ నసీర్, టీడీపీ నేతలు

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం రావాలంటే టీడీపీ- జనసేన- బీజేపీ కూటమిని గెలిపించుకోవాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ప్రజా దీవెన యాత్ర నాలుగవ రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పు నియోజకవర్గం 55, 56 డివిజన్ బుచ్చయ్యతోట, నెహ్రూనగర్ ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ- జనసేన- బీజేపీ కూటమికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతిని సృష్టించుకోవడం, సచివాలయం, హైకోర్టు నిర్మాణం జరిగిందని, వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫా ఈ 5 సంవత్సరాలలో తన వ్యాపారాల మీద, ,దోచుకోవడం మీద పెట్టిన శ్రద్ధ నియోజకవర్గం మీద పెట్టలేదని విమర్శించారు. తూర్పు నియోజకవర్గంలోని అన్ని సమస్యలపై తనకు అవగాహన ఉందని, రాబోయే ఎన్నికలలో ప్రజలందరూ మద్దతు తెలిపి, తనను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వేములకొండ శ్రీనివాస్, మేకపోతుల సోమ శేఖర్, పాటిబండ్ల బలరాం, గుడిపల్లి వాణి, దాసరి రావణ్, బత్తిన శంకర్, యద్దల రమేశ్, ముబ్వా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జనసేన 56వ డివిజన్ అధ్యక్షురాలు బిట్రగుంట్ల మల్లిక నివాసంలో బస చేశారు. అక్కడే జనసేన నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. నసీర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరేళ్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తి చిట్టిబాబు, దాసరి రాజా మాస్టర్, కార్పొరేటర్లు భారతి, పోతురాజు సమత, గుడిపల్లి వాణి, బత్తులశంకర్, ముకుందరావు, బిట్రగుంట్ల మల్లిక, వేముల కొండ శ్రీనివాస్, గోళ్ళ ప్రభాకర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గం 6వ డివిజన్ గుంటూరువారి తోటకి చెందిన వైసీపీ నేత తిరుపాల్ రెడ్డి, కేవీ నారాయణరెడ్డి, కే రామచంద్రారెడ్డి, చిన్నిశ్వర్ రెడ్డి, రఘురామ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు టీడీపీలో చేరారు. నసీర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, చంద్రశేఖర్, చిలక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మొహమ్మద్ నసీర్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 15 : మతిస్థిమితం లేని వృద్ధుడు శెట్టిపల్లి మాలకొండయ్య (76) అదృశ్యమయ్యాడు. స్థానిక గాంధీనగర్ మూడో లైనుకు చెందిన కొండయ్య ఈ నెల 14న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ళవద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. కొండయ్య కుమారుడు శెట్టిపల్లి మార్కామని ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్‌కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు లాలాపేట స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.



మాలకొండయ్య (ఫైల్)

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

● వినియోగదారుల కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు హరిబాబు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15: వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి చేస్తున్న ఉద్యమంలో యువత భాగస్వాములు కావాలని వినియోగదారుల కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు చదలవాడ హరిబాబు అన్నారు. వినియోగదారులు హక్కులపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ జంక్‌ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌లలో వినియోగిస్తున్న ప్రమాదకర టెస్టీ సాల్ట్‌పై ప్రచారం నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ ఎం సెల్వరాజ్, ఎం కమాలాకాంతన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మహిళలకు అభివాదం చేస్తున్న గళ్ళా మాధవి

ప్రజలు ధర్మం వైపే నిలబడతారు

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గళ్ళా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధంలా జరుగనున్నాయని, ప్రజలు ధర్మం వైపే నలపడతారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గళ్లా మాధవి అన్నారు. గుంటూరు 44వ డివిజన్లో జోన్- 5 రీజనల్ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, జనసేన సమన్వయకర్త బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, తాళ్ల వెంకటేశ్‌లతో కలిసి ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ నాడు రామచంద్రుడు భారతావనికోసం ధర్మ పోరాటం చేస్తే, నేడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ధర్మ పోరాటం చేస్తున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో టీడీపీ ప్రచారానికి స్వచ్ఛందంగా తరలివస్తున్న ప్రజలను చూస్తే వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కనబడుతుందన్నారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాని మాధవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లి అనీల్, కన్నసాని బాజి, యర్రాకుల శ్రీనివాస్, పవన్ వెంకీ, కన్నసాని రాజా, నూతలపాటి సాంబశివరావు, కోటీశ్వరావు, బెల్లగొబ్బుల వాసు, విజయలక్ష్మి, సిద్దార్థ, అజయ్, బాలాజీ, గ్యాలం హనుమంత్ పాల్గొన్నారు

పశ్చిమలో మళ్లీ టీడీపీ గెలుపు ఖాయం

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మరోసారి టీడీపీ గెలుపు ఖాయమని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. పశ్చిమ పరిశీలకుడుగా నియమితుడైన ఆయనను సోమవారం సాయంత్రం పశ్చిమ కూటమి అభ్యర్థి గల్లా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గల్లా మాధవి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు. పశ్చిమలో టీడీపీ గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానని ఆమెతో అన్నారు.

రేపు నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని బుధవారం నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు శ్రీరామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కారంశెట్టి లోకేష్ తెలిపారు. సోమవారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శోభాయాత్ర వివరాలను వెల్లడించారు. ఆరు సంవత్సరాల నుంచి ఈ యాత్రను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ ఏడాది జరుపుతున్నట్టు వివరించారు. యాత్ర బృందావన్‌గార్డెన్, శ్రీ వేంకటేశ్వర ఆలయం నుంచి ఉదయం 9గంటలకు ప్రారంభమై లక్ష్మీపురం, శంకర్‌విలాస్, నాజ్ సెంటర్, పాతగుంటూరు. నల్లచెరువు, మిర్చియార్డు మీదుగా నల్లపాడు వద్ద ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. యాత్రను హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ ప్రారంభిస్తారని వివరించారు. యాత్రలో ప్రజలు, రామ భక్తులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవసమితి సభ్యులు బ్రహ్మారెడ్డి, తియ్య వేణుగోపాలరెడ్డి, అడపా ఫణీంద్ర, తునుగుంట్ల రాజేష్, సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలతో క్షమాపణ చెప్పించాలి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారిపై దాడి చేసిన వైసీపీ నేతలతో క్షమాపణ చెప్పిం చాలని పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ రాష్ట్ర వడ్డెర సాధికార కన్వీనర్ వడ్డే వెంకట్ డిమాండ్‌చేశారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. గుంటూరు వైసీపీ నేతల ఆగడాలు రోజురోజుకూ మితి మీరు పోతున్నాయని, ఇప్పటివరకు ప్రజల మీద దాడులు జరుగుతుంటే స్పం దించని పోలీసులు, ఈరోజు పోలీసుల పైనేదాడులు జరుగుతున్నా మౌనం వహించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లె ఈశ్వరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో వడ్డే వెంకట్, మల్లె ఈశ్వరరావు, ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రగిరి బాబు, సాంబ, మణికుమారి, బాబు, మూర్తి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు-1 ,2 కేంద్రాల నుండి అగ్నిమాపక శకటములు తో ఈ కార్యక్రమం నిర్వహించారు.వాటర్ బ్రౌజర్లు ర్యాలీగా బయలుదేరి మైక్ ద్వారా ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలు, వంట గదిలో, ఆసుపత్రి, హోటల్స్ లలో జరుగు ప్రమాదాల పై మాక్ డ్రిల్ నిర్వహించారు.నాజ్ సెంటర్ లో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డిస్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కృషితోనే అందరికి ఓటు హక్కు

● డీఆర్ఎం ఎం.రామకృష్ణ వెల్లడి

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓటుహక్కు ఎవరికి కల్పించాలన్న ప్రశ్న తలెత్తినప్పుడు కొందరు పన్ను చెల్లింపుదారులకు, మరికొందరు విద్యావంతులకు, పురుషులకే ఉండాలని చెప్పారు. అయితే దేశంలో ఆనాడు 21 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని వాదించి అమలు చేయించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఉన్న అమరావతి ఎనెక్స్‌లో అంబేడ్కర్ 133వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్ఎంతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్ఎం మాట్లాడుతూ అంబేడ్కర్‌ని ఆయన జయంతి రోజునే కాకుండా నిత్యం ఆరాధించాలన్నారు. భారత రాజ్యాంగం రూపకల్పనకు ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించి అందరికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల రైల్వే అధికారులు, యూనియన్లు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'మై డియర్ దొంగ' చిత్రబృందం సందడి



వీవీఐటీలో సందడి చేస్తున్న చిత్ర బృందం

పెదకాకాని, ఏప్రిల్ 15: అభినవ్ గోమఠం, షాలినీ, దివ్యశ్రీపాద ప్రధాన పాత్రలలో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'మై డియర్ దొంగ' చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదలకానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం సోమవారం వీవీఐటీలో చిత్ర ప్రచార కార్యక్రమం నిర్వహించారు. హీరో అభినవ్ గోమఠం మాట్లడుతూ ఈ చిత్రం ఆద్యాంతం హాస్య ప్రధానంగా సాగుతుందని, ఇటీవల విడుదలైన టీజర్‌కు విశేష స్పందన వచ్చిందని, ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందని అన్నారు. అనంతరం చిత్రబృంద సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న లాలాపేట సీఐ

గుంటూరు, ఏప్రిల్ 15 : స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లాలాపేట సీఐ దేవ ప్రభాకర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో త్వరలో జరుగనున్న ఎన్నికలలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వారిని ఏ పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లందరిపై నిఘా ఉంటుందన్నారు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నా, ఓటర్లను భయపెట్టే ప్రయత్నం చేసినా చర్యలు తప్పవని సీఐ దేవ ప్రభాకర్ హెచ్చరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 15 : మిర్చి సాగు చేసి అప్పులపాలైన కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జొనం చుండూరుకు చెందిన యువరైతు సాదరబోయిన కన్నయ్య (36) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కన్నయ్య రూరల్ మండలం వెంగళాయపాలెం వద్ద నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిర్చి పంటసాగు చేసాడు. పంట సరైన దిగుబడి రాకపోవడం వలన తీసుకొచ్చిన అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో చావే శరణ్యం అని భావించాడు. సోమవారం జొనం చుండూరులోని తన ఇంటిలో ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల సమన్వయకర్తగా అనిల్‌కుమార్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15: జై భారత్ నేషనల్ పార్టీ గుంటూరు పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తగా నగరానికి చెందిన జల్లి అనిల్‌కుమార్ నియమితులైయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ నియామక పత్రాలను విడుదల చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో ప్రచారం చేసి జై భారత్ నేషనల్ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని జల్లి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. సమన్వయ కర్తగా నియమించిన ఆ పార్టీ అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ. రవికిరణ్‌లకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే మానవాభివృద్ధి సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్), జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) సంయుక్తంగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక 2024ను తయారుచేసి ఇటీవల విడుదల చేశాయి. పోటీప రీక్షలకు తయారయ్యే విద్యార్థులు ఈ నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలించి దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికవేత్తలు, అర్థశాస్త్ర విద్యార్థులు ఈ నివేదికను చదవడం అవసరం. ఇతరులు కూడా నివేదికలోని ప్రధానాంశాలను పరిశీలించినా భారత ఆర్థికవ్యవస్థ, ఉద్యోగితా/ నిరుద్యోగం స్థితిపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉద్యోగితా స్థితికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక చలాంకాల ధోరణి ఈ మధ్య కాలంలో కిందివిధంగా ఉంది.

ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

భారత శ్రామికశక్తి: పదిహేను సంవత్సరాలు, ఆపై వయసు ఉండి ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారు, ఉపాధి పొందుతున్న వారి మొత్తాన్ని శ్రామికశక్తి(లేబర్ ఫోర్స్)గా పరిగణిస్తారు.

శ్రామికశక్తి రేటు: మొత్తం జనాభాలో శ్రామికశక్తి శాతాన్ని శ్రామికశక్తి రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) అంటారు. 2024 ఉద్యోగితా నివేదిక ప్రకారం భారత దేశ శ్రామికశక్తి రేటు 2022లో 55.2 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు 59.8 శాతంగా ఉండటం గమనార్హం. అంటే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు కంటే మన దేశ శ్రామికశక్తి రేటు తక్కువగా ఉంది.

- అంతేకాకుండా కొంతకాలంగా భారత శ్రామికశక్తి రేటు తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. భారత శ్రామికశక్తి రేటు 2000లో 61.6 శాతం కాగా 2019 నాటికి 50.2 శాతానికి చేరింది. అయితే 2022 నాటికి తిరిగి అది 55.2 శాతానికి పెరిగింది. నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 39.63 కోట్లు ఉండగా 2019 నాటికి 49.55 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు పదికోట్లు(9.92 కోట్లు) పెరిగింది. ఇక 2022లో భారత శ్రామికశక్తి 56.74 కోట్లుగా ఉంది.

కార్మికశక్తి(వర్కింగ్ ఫోర్స్): ఏదేని ఆర్థిక కార్యక్రమంలో ఉపాధి పొందుతున్న వారిని కార్మికశక్తి అంటారు. మొత్తం జనాభాలో కార్మికశక్తి శాతాన్ని జనాభా కార్మికశక్తి నిష్పత్తిగా పిలుస్తారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారత కార్మికశక్తి నిష్పత్తి 2022లో 52.9 శాతంగా ఉంది. అయితే 2000లో ఇది 60.2 శాతంగా ఉండి 2019 నాటికి 47.3 శాతానికి తగ్గింది.

- నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 38.71 కోట్లు కాగా 2019లో 46.65 కోట్లు, ఇక 2022లో 54.45 కోట్లు.

నిరుద్యోగం రేటు: మొత్తం శ్రామికశక్తిలోని నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగరేటు అంటారు.

సాధారణ స్థితి నిరుద్యోగం

సర్వే సంబంధిత సంవత్సరకాలం(365 రోజులు)లో ఎక్కువ కాలం ఉపాధి దొరకని వారిని సాధారణ స్థితి నిరుద్యోగులు అంటారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారతదేశ సాధారణ స్థితి(యూజ్‌వల్ స్టేటస్) నిరుద్యోగం రేటు 2000లో 2.3 శాతం ఉండగా 2019 నాటికి 5.8 శాతానికి పెరిగింది. అయితే 2022 నాటికి తిరిగి 4.1 శాతానికి చేరింది. నిరపేక్షికంగా సాధారణ స్థితి నిరుద్యోగుల సంఖ్య 2000లో 9.2 మిలియన్లు ఉండగా 2019 నాటికి 29 మిలియన్లకు చేరింది. అయితే 2022లో అది 22.9 మిలియన్లుగా ఉంది.

- మొత్తమ్మీద శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి రేటు 2000 నుంచి 2019 సంవత్సరాల మధ్య తగ్గగా, 2019-2022ల మధ్య పెరిగాయి. ఇక నిరుద్యోగం రేటు 2000-2019 సంవత్సరాల మధ్య పెరగ్గా 2019-22 సంవత్సరాల మధ్య తగ్గింది. 2012 నుంచి 2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి పెరిగిన స్థాయిలో ఆర్థికవ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్తరించకపోవడం వల్ల నిరుద్యోగం రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది.
- అయితే 2019-2022 సంవత్సరాల మధ్య నిరుద్యోగం రేటు కొంత తగ్గినప్పటికీ ప్రపంచ ఆర్థిక మందగమనం దృష్ట్యా ఉద్యోగాల నాణ్యత, తక్కువ ప్రతిఫలంతో కూడిన ఉద్యోగిత గమనించదగ్గ అంశాలుగా నివేదిక చెప్పింది.

పురుషుల, స్త్రీల ఉద్యోగితా స్థితి

- 2022 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 77.2 శాతం ఉండగా, స్త్రీల శ్రామికశక్తి రేటు 32.8 శాతంగా ఉండటం గమనార్హం. ప్రపంచ సగటు మహిళా శ్రామికశక్తి రేటు 47.3 శాతం కాగా దక్షిణాసియా సగటు మహిళా శ్రామికశక్తి రేటు 24.8 శాతంగా ఉంది. 2000 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 83.6 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 38.9 శాతంగా, 2019లో పురుషుల శ్రామికశక్తి రేటు 75.5 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 24.5 శాతంగా ఉంది. కార్మికశక్తి నిరుద్యోగం రేట్లలో కూడా ఇదే ధోరణి ఉంది.

గ్రామీణ, పట్టణ ఉద్యోగితా స్థితి

- మొత్తమ్మీద పురుషులు, స్త్రీల విషయంలోనూ, గ్రామాలు, పట్టణాల్లో కూడా 2000-2019 సంవత్సరాల మధ్య శ్రామిక శక్తి రేటు, కార్మికశక్తి శాతం తగ్గగా, నిరుద్యోగం రేటు పెరిగింది. 2019-22 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మిక శక్తి శాతం పెరగ్గా నిరుద్యోగం రేటు తగ్గింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

ఐకార్ ఆలిండియా పీజీ, పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్



వ్యవసాయ సంబంధిత పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో నిర్దేశిత కోటా సీట్ల భర్తీకి ఉద్దేశించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)పీజీ 2024', ఐకార్ ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఫర్ డాక్టోరల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఐసీఈ- జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్-పీహెచ్‌డీ)2024'లకు నోటిఫికేషన్‌లు వెలువడ్డాయి. ఈ ఎగ్జామ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వీటిలో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ

విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రానమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/అగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

అర్హత: విభాగాన్ని అనుసరించి(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరికల్చర్/బయోటెక్నాలజీ/అగ్రిల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/వెటర్నరీ సైన్సెస్/కమ్యూనిటీ సైన్స్/హోమ్ సైన్స్/డెయిరీ); (బీఈ/బీటెక్)(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ ఇంజనీరింగ్/ఫిషరీ సైన్స్); బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.625

పీహెచ్‌డీ (జేఆర్ఎఫ్/ ఎస్ఆర్ఎఫ్)

స్పెషలైజేషన్‌లు: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్లాంట్ పాథాలజీ, నెమటాలజీ, ఎంటమాలజీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ ఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వెజిటబుల్ సైన్స్, ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్-స్పైసెస్- మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ పాథాలజీ, డెయిరీ కెమిస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో(జనరల్ నాలెడ్జ్/రీజనింగ్ ఎబిలిటీ)(అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీ, డెయిరీ, ఫిషరీస్, అలైడ్ సైన్సెస్) అంశాలనుంచి 20, రెండో పార్ట్‌లో కోర్ గ్రూప్ సబ్జెక్ట్ నుంచి 50, మూడో పార్ట్‌లో స్పెషలైజేషన్ సబ్జెక్ట్ నుంచి 50 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.975.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 11
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పరీక్షల తేదీ:** జూన్ 29న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/ICAR/

ఆంధ్ర వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ)- మూడేళ్ల బీబీఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ+ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లకు విశాఖ ఐఐఎం సహకారం అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి మూడేళ్ల తరవాత కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ డిగ్రీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీబీఏ+ఎంబీఏ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఫౌండేషన్ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, కేస్ స్టడీస్, విదేశీ ప్రొఫెసర్ల ఆన్‌లైన్ లెక్చర్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏటా కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- క్రియేటివిటీ, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్, టీంవర్క్, బిజినెస్ ఎథిక్స్, స్ట్రాటజిక్ అనాలిసిస్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- **స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ద్వితీయశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DiVzTTgలో చదవండి.

ఎడ్యు న్యూస్

'ఈజీ ఇంగ్లీష్' ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్- 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈజీ ఇంగ్లీష్' ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆఫర్ చేస్తోంది. ఇంగ్లీష్‌కు తోడు మోటివేషనల్ సెమినార్లు, వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా ఉంటాయి. మొత్తమ్మీద పది ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుంది. ఈ సంస్థ ఫౌండర్, చీఫ్ అయిన డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహణ ఉంటుంది. ఏప్రిల్ మూడో వారంలో కోర్సు ఆరంభమవుతుంది. కోర్సు కాలవ్యవధి మూడు వారాలు కాగా, ఈ నెల 21 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాలకోసం 9866006662 నెంబర్లో మాట్లాడవచ్చు.

హైదరాబాద్ ఐఐటీలో 'గ్రీన్కో' పీహెచ్‌డీ ఫెలోషిప్స్

హైదరాబాద్ ఐఐటిలోని గ్రీన్కో స్కూల్ ఆఫ్ సస్టయినబిలిటీ - పీహెచ్‌డీ ఫెలోషిప్స్‌ను ప్రకటించింది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫర్ నెట్ జీరో ట్రాన్సిషన్‌కు సపోర్ట్ చేసే పనిలో భాగంగా ఈ ఫెలోషిప్‌ను ఇస్తోంది. ఆరు గ్రీన్కో ఫెలోషిప్స్ ఉన్నాయి అలాగే మరో నాలుగు ఎంటెక్ ఫెలోషిప్స్ అయిదేళ్ళ కాలవ్యవధికి ఉన్నాయి. యూజీసీ - నెట్/ గేట్/ సీడ్/ సీఐఎస్ఆర్ టెస్టుని క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఎంటెక్ స్కాలర్‌షిప్స్ కోరే విద్యార్థులు ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎండిజైన్/ ఎం.ఆర్క్ పాసై ఉండాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.75,000 చొప్పున నాలుగేళ్ళ పాటు చెల్లిస్తారు. మూడు లక్షల మేరకు వార్షిక కంటింజెన్సీ ఫండ్ కూడా ఇస్తారు.

వెబ్‌సైట్: http://www.iith.ac.in/phdadmissions, https://gss.iith.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

కలిసి నటించాలని ఎదురుచూస్తున్నా...



'వార్-2' చిత్రంతో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముంబయి వెళ్లారు. తాజాగా, నటి ఊర్వశీ రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తారక్‌తో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుని.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ఎన్టీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో క్రమశిక్షణ, వినమ్రత, నిజాయితీ, ముక్కుసూటితనం కలిగిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్టీఆర్‌తో కలిసి నటించాలని ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.

ఘనంగా తమిళ దర్శకుడు
శంకర్ కుమార్తె వివాహం



ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ - ఈశ్వరీ శంకర్‌ల కుమార్తె ఐశ్వర్య వివాహం తరుణ్ కార్తికేయన్‌తో జరిగింది. సోమవారం చెన్నైలో జరిగిన ఈ వివాహ వేడుకలో తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చలన చిత్ర ప్రముఖులు రజనీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విక్రమ్, విశాల్, అర్జున్, కీర్తి సురేశ్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం - సుహాసిని దంపతులు, కె.భాగ్యరాజ్, పి.వాసు, కేఎస్ రవికుమార్, హరి, విష్ణువర్ధన్, విఘ్నేష్ శివన్ - నయనతార దంపతులు, నిర్మాతలు ఆర్బీ చౌదరి, జయంతిలాల్ గడ, ఏఎం రత్నం, దిల్ రాజు, ఐసరి కె.గణేశ్ తదితరులు హాజరయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

100 రోజులు... రూ. వంద కోట్లు



క్రికెట్‌లో సెంచరీ కొడితే ఆ ఆటగాడికి చెప్పలేనంత క్రేజ్.. ఫ్యాన్స్, మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేస్తాయి. అలాగే ఓ సినిమా రూ. వంద కోట్లు కలెక్ట్ చేస్తే ఆ చిత్ర బృందానికి వచ్చే కిక్కే వేరు. క్రికెట్‌లో ఆటగాడు సెంచరీ కొట్టాలంటే అది అతని ఒక్కడితోనే అయ్యే పని. కానీ సినిమా విషయం అలా కాదు. అది రూ.. వంద కోట్ల మైలురాయి చేరాలంటే దాని వెనుక చిత్ర బృందం కఠోర శ్రమ దాగి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ గడిచిన వంద రోజుల్లో ఈ డ్రీమ్ టార్గెట్‌ను అందుకున్న దక్షిణాది సినిమాల వివరాలు ఇవీ.

పూర్తి కథనం... ఈ-పేపర్‌లో...



'ఇప్పుడే 'పుష్ప 2' టీజర్ చూశా. అద్భుతంగా ఉంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటన నాకు బాగా నచ్చింది. ఆ సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'.. ఈ

పుష్ప 2 కు బాలీవుడ్ దర్శకుడి ప్రశంసలు

మాటలు అన్నది ఎవరో తెలుసా. బాలీవుడ్ దర్శకుడు అనిల్ శర్మ. 'గదర్ 2' చిత్రంతో సూపర్ హిట్ సాధించిన ఈ దర్శకుడు తన ప్రశంసలను కొనసాగిస్తూ 'గత ఏడాది ఆగస్టు 15న నా చిత్రం 'గదర్ 2' విడుదలై మంచి విజయం సాధించింది. ఈ ఏడాది అదే రోజున 'పుష్ప 2' రిలీజ్ అవుతోంది. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు, ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు' అన్నారు.

ఐఫా వేదికపై శ్రీలీల మెరుపులు



చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగప్రవేశం చేసి అనతికాలంలోనే అగ్ర హీరోలతో జతకట్టే స్థాయికి చేరారు నటి శ్రీలీల. 'పెళ్లి సందడి', 'ధమాకా', 'స్కంద' 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' వంటి చిత్రాలతో వరుసగా సందడి చేసిన ఈ భామ జోరు ఇటీవల బాగా తగ్గింది. నటిగా కంటే మంచి డాన్సర్‌గా ఎక్కువ పేరు తెచ్చుకున్న ఈ నాజూకు భామకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. అయితే అది సినిమాలో కాదు. దుబాయ్‌లో సెప్టెంబరులో జరిగే ఐఫా ఉత్సవాలలో డాన్స్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు శ్రీలీల. మంచి డ్యాన్సర్‌గా పేరొందిన ఈ నటి ఐఫా వేదికపై తన మెరుపులతో ప్రేక్షకులను రంజింపచేయనున్నారు. అలాగే ఇటీవలే పెళ్లి చేసుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ కూడా తన నృత్యంతో ప్రేక్షకుల మతిపోగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఈ ఇద్దరు భామలు ఐఫా వేదికకు సరికొత్త అందం ఇవ్వనున్నారు. ఈ వేడుకలో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కూడా భాగం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో.. తెలుగు వేడుకలకి దగ్గుబాటి రానా ..మిగతా విభాగాలకు అకుల్ బాలాజీ, విజయ్ రాఘవేంద్ర వాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.

నవ్వించడానికి సిద్ధం



'అల్లరి' నరేశ్ తన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌ను మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తోంది. చాలా రోజుల తర్వాత మళ్లీ నరేశ్ పూర్తి స్థాయిలో ఫన్ క్యారెక్టర్ పోషించడంతో ఈ సినిమా కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు రచన: అబ్బూరి రవి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: సూర్య, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.

ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం



'బిగ్ బాస్' ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రిక్ హీరోయిన్‌గా నటించిన 'తెప్ప సముద్రం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మాత. ఆదివారం రాత్రి ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి సినిమాలోని మొదటి పాటను విడుదల చేశారు. ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ 'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఎందరో కష్టపడాలి. నేను చిరంజీవిగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ 'చిన్న సినిమా అనగానే నిర్మాతకు, దర్శకుడికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మా నాన్న, పెద నాన్న డిస్ట్రిబ్యూటర్స్ కాబట్టి ఆ వేదన నాకు తెలుసు. ప్రతి ఒక్కరూ చిన్న సినిమాను బతికించాలని కోరుతున్నా. ఈ సినిమా 90 శాతం షూటింగ్ పోచంపల్లిలో జరిగింది' అని చెప్పారు. 'తెప్ప సముద్రంలో చిన్న పిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. అవి థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం' అని దర్శకుడు సతీశ్ చెప్పారు.

తెలుగులో తొలిసారి!



తెలుగులో సెటైరికల్ ఫిల్మ్ కొన్ని వచ్చాయి కానీ పొలిటికల్ సెటైరికల్ ఫిల్మ్ తక్కువ అనే చెప్పాలి. అందుకే ఈ తరహా కాన్సెప్ట్ ఎన్నుకొని ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి డైలాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఒక ఓటుకి ఇంత అని డబ్బు నిర్ణయిస్తుంటారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటుని నిర్ణయించడం విశేషం. ఇటువంటి కాన్సెప్ట్ తెలుగులో రావడం ఇదే తొలిసారి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ ముఖ్య పాత్ర పోషించారు. వినయ్, అరుణ్, దీప్తి వర్మ ఇతర ముఖ్య తారాగణం. తాడిపత్రి నేపథ్యంగా చిత్ర కథ ఉంటుందనీ, త్వరలో సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫూస్, ఛాయాగ్రహణం: నాని ఐనవల్లి, నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2hcliJG లో చదవండి.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాదెండ్ల మనోహరం, అన్నాబత్తుని జయలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● ఎన్నికల ప్రచారంలో నాదెండ్ల మనోహరం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 15: రానున్న ఎన్నికలలో రాష్ట్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ నాదెండ్ల మనోహరం కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 21వ వార్డు మారీసుపేటలో ఇంటింటికి తిరుగుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. తెనాలి అభివృద్ధికి వారు ఇరువురూ కృషి చేస్తారని, ప్రజలందరూ ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి పెమ్మసాని రాజ్యలక్ష్మి, మంగమూరి బ్రదర్స్, రావి చిన్ని, కోగంటి శంకరావు, ఆట్లూరి జయకృష్ణ, బోయపాటి అరుణ, కె అక్కేశ్వరావు, నన్నపనేని రాంబాబు, ఇస్మాయిల్, చింతి రఘు, కె.తిరుమల, కేశవ, సూరిబాబు, శ్రీను, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు హక్కు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంటు కమిషనర్ అనూష, రామచంద్రరావు తదితరులు

ప్రిసైడింగ్ అధికారులకు అవగాహన కార్యక్రమం

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 15: భారత ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ (ఎస్‌వీఇఇపీ)లో భాగంగా ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నేపథ్యంలో అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న నిర్వహించారు. సోమవారం బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా కాలేజీలో పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పీఓస్, ఏపీఓస్‌కి పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం గురించి, ఓటర్ల గుర్తింపు ధ్రువీకరించడం, ఎన్నికల చట్టాల గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మనమందరం ఓటు వేద్దామని నినాదాలు చేస్తు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, కొల్లిపర ఎంఆర్‌వో, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు జడ్ సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద నివారణపై ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తెనాలి క్రైం, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేపట్టవలసిన చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి సూరిబాబు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రధాన కూడళ్ళు, రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలపై ప్రత్యక్ష ప్రదర్శల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా మహిళలకు ఒంట గదుల్లో జరిగే ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనివల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు కూడా జరుగుతున్నాయని, ఇళ్ళలో, కర్మాగారాల్లోను సరైన నాణ్యతా ప్రమాణాలు ఉన్న విద్యుత్ పరికరాలను ఉపయోగించాలని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది షేక్ సాయిబాబు, జి.వి.సుబ్బారావు, నాగేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో పెమ్మసాని, ధూళిపాళ్ల పర్యటన

పెదకాకాని, ఏప్రిల్ 15: పెదకాకాని మండల పరిధిలోని మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమారులు మంగళవారం పర్యటించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 7:30కి కొప్పురావూరులో ఎన్నికల ప్రచారం ప్రారంభమైందన్నారు. ఉదయం 9:30గంటలకు వెనిగండ్లలో పర్యటిస్తారన్నారు. సాయంత్రం పెదకాకానిలో పర్యటిస్తారని మురళి పేర్కొన్నారు.

కృష్ణానదిలో చెక్‌డ్యామ్ ఏర్పాటు చేస్తాం

● జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, ఏప్రిల్ 15: కృష్ణానదిలో చెక్‌డ్యామ్ ఏర్పాటుచేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి తనవంతు కృషి చేస్తానని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం జనచైతన్య పాదయాత్రంలో భాగంగా మనోహర్ మండల పరిధిలోని తూములూరులో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందని మరలా అభివృద్ధి చెందాలంటే పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీ నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. రోడ్లు చూస్తే గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. గతంలో ఒక ప్రణాళికతో కొల్లిపర మండలాన్ని అభివృద్ధిలో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిపినట్లు తెలిపారు. మరలా మనం అధికారంలోకి వచ్చాక మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రూ.35కోట్లతో నాడు రక్షిత తాగునీటి పథకాన్ని తీసుకువచ్చి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటి కొరతలేకుండా చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేస్తున్న ఉమ్మడి అభ్యర్థులు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, టీడీపీ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుడిబండి గోవర్ధనరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కొండా కిశోర్‌రెడ్డి, చాగంటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలా మోసపూరిత వాగ్ధానాలు చేయం..

తెనాలి రూరల్, ఏప్రిల్ 15: వైసీపీ ప్రభుత్వం మాదిరి ప్రజలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ మోసపూరిత వాగ్దానాలు చేయమని ప్రజలకు చేసేది చెబుతామని జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగు జనచైతన్య పాదయాత్రలో భాగంగా సోమవారం నాదెండ్ల మనోహర్ ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో 19, 20వ వార్డులలో పర్యటించారు. చిరు వ్యాపారులను, కూరగాలయ వ్యాపారులను స్థానికంగా నివాసముంటున్న గృహిణులు, ప్రజల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను విచారించారు. అనంతరం ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించి రానున్న రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం ద్వారా మంచి జరుగుతుందని భరోసా కల్పించారు. పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

యాదవ సంఘీయుల సంక్షేమానికి కృషి చేస్తా: నాదెండ్ల

తెనాలి రూరల్: రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టిన అనంతరం యాదవ సంఘీయులు తనకు తెలిపిన ప్రతి సమస్యను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తానని జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఉమ్మడి పార్టీల యాదవ సంఘీయులు మనోహర్‌ను కలిసి వారి సమస్యలను విన్నవించారు. రానున్న ఎన్నికల్లో మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్లను గెలిపించుకునేందుకు తామంతా కృషి చేస్తామని సంఘీయులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టి. శ్రీనివాసరరావు, ఎస్.రమ్య, ఎం.కొండాయాదవ్, కె.వాసు, టి. బ్రహ్మేశ్వరరావు, ఎ.శ్రీనివాసరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఆశయం గొప్పది: ధూళిపాళ్ళ

చేబ్రోలు, ఏప్రిల్ 15: పవన్ కల్యాణ్ ఆశయం చాలా గొప్పదని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని శ్రీరంగపురం, మంచాల గ్రామాలో సోమవారం టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నరేంద్ర కుమార్ గ్రామస్థులతో మాటామంతీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన అంతం కావాలంటే కూటమి ప్రభుత్వాని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కల్యాణ్ గొప్ప ఆశయంతో ముందుకు వచ్చారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని అరాచక వైసీపీ తిరిగి అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతో పవన్ కల్యాణ్ కూటమి ఏర్పాటుకు ముందడుగు వేసినట్లు చెప్పారు. పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించటమే పనిగా రాష్ట్ర మంత్రులు పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పవన్ కల్యాణ్‌ను దూషించినప్పుడు కులం ఎందుకు గుర్తుకు రావటం లేదని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలో ప్రజలు విజ్ఞతతో కూటమికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు రెండు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాదరణ కోల్పోయిన జగన్ ప్రభుత్వం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: అపరిమిత అధికారం ఇచ్చిన ప్రజలకు మేలు చేయలేక జగన్ ప్రభుత్వం జనాదరణ కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని 4, 5 వార్డులో నరేంద్ర కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులకు వచ్చిన నరేంద్ర కుమార్‌కు ముస్లిం మైనార్టీలు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెండా చెట్టు వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో నరేంద్ర కుమార్ పాల్గొన్ని మత పెద్దల ఆశీర్వచనాలు స్వీకరించారు. వార్డులో ఇంటింటికి వెళ్లిన నరేంద్ర కుమార్ వారి సమస్యలు అడిగి తెలుసుకోవటమే కాకుండా బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. వార్డు వాసులు గత ఐదేళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజలు జగన్ రెడ్డికి అపరిమితమైన అధికారాన్ని అందించారన్నారు. కానీ ఆ అధికారాన్ని ప్రజల కోసం వినియోగించకుండా పాలకులు సొంత లాభానికి వాడుకున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో ముస్లిం మైనార్టీలకు ప్రత్యేకంగా చేసింది ఏంటని నిలదీశారు. టీడీపీ ప్రభుత్వం పేద ముస్లిం యువతల వివాహాలకు దుల్హన్ పథకాన్ని అమలుచేసి రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించిన్నట్లు గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలిపి వేయటమే కాకుండా ఎన్నికలముందు పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రచారం చేశారన్నారు. ఆ పథకానికి కూడా షరతులు విధించటంతో పేద యువతుల వివాహాలకు ఆర్థికసాయం అందకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అవ్వటానికి లేని నిబంధనలు పేదల పథకాలకు ఎందుకు విధించారని జగన్‌రెడ్డిని నిలదీశారు. నిజంగా ముస్లిం మైనార్టీలపై చిత్తశుద్ధి వుండివుంటే పథకాలకు అడ్డగోలు నిబంధనలు విధించరన్నారు. అలాగే టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభించిన షాదీఖానాల



నరేంద్ర కుమార్ యోగక్షేమాలు విచారిస్తున్న వృద్ధురాలు

పనులను నిలిపివేయించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. కేవలం నిధులు లేని కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించి ముస్లింల ప్రగతికి అడ్డుకట్ట వేశారని దుయ్యబట్టారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పాటు పడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాకాని శివాలయం పాలకమండలి సభ్యుడు టీడీపీలోకి

పెదకాకాని, ఏప్రిల్ 15: పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు తోట రవీంద్ర కుమార్ పొన్నూరు నియోజకవర్గం జనసేన, బీజేపీ పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో సోమవారం చేరారు.

ఆలయ ఛైర్మన్ కందుల వెంకటేశ్వర్లు ...

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: మండల పరిధిలోని ములుకుదురు గ్రామానికి చెందిన చెన్నకేశవస్వామి దేవాలయ ఛైర్మన్ కందుల వెంకటేశ్వర్లు సోమవారం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల పరిధిలోని చింతలపూడి నరేంద్రకుమార్ స్వగృహంలో కందుల వెంకటేశ్వర్లుతోపాటు పంచాయతీ వార్డు మెంబర్ లుక్కా కేశవమూర్తి, కోల గిరిబాబు, మోర్ల హనుమంతరావు తదితరులు టీడీపీలో చేరారు.

కోదండ రాముడికి ధూళిపాళ్ల ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఏప్రిల్ 15: మండల పరిధిలోని కొప్పురావూరులో శ్రీకోదండ రాముడి పునర్ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా సోమవారం జరిగింది. పునర్ ప్రతిష్ఠ మహోత్సవంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ విన్నకోట పూర్ణ శంకర్రావు, జనసేన నాయకులు కాలిశెట్టి సహదేవరావు, భక్తులు పాల్గొన్నారు.

నూతన ఎక్సరే పరికరం ఏర్పాటు పనులతో...

జిల్లా వైద్యశాలలో నిలిచిన ఎక్సరే సేవలు



జిల్లా వైద్యశాలలో నూతన ఎక్సరే పరికరాన్ని అమరుస్తున్న టెక్నీషియన్స్

తెనాలి రూరల్, ఏప్రిల్ 15: తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో ఎక్సరే సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. నూతన టెక్నాలజీతో రూపుదిద్దుకున్న 500 ఎంఏహెచ్‌పీ ఎక్సరే మిషన్‌ను పాత మిషన్ స్థానంలో బిగిస్తున్నారు. దీంతో మరో రెండు రోజులు ఎక్సరే సేవలకు ఆటంకం ఏర్పడనుంది. సోమవారం వైద్యసేవలకు వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల్లో ఎక్సరే సేవలు అందుబాటులోకి రానున్నట్లు వైద్యశాలవర్గాలు వెల్లడించారు. ఈ మిషన్‌లో నూతన టెక్నాలజీ పొందుపరచడంతో ఎక్సరే సేవలు మరింత వేగవంతంగా జరుగుతాయని, దీనికి రేడియేషన్ సైతం గత మిషన్లతో పోలిస్తే తక్కువగా ఉంటుందని టెక్నీషియన్స్ తెలిపారు.

టీబీరోగులకు మందులేవి..!

టీబీరోగులకు వైద్యశాల్లో మందులు అందుబాటులో లేవు. ఫలితంగా ఆ వ్యాధి గ్రస్తులు మందుల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా పూర్తి ఉచితంగా మందులు అందిస్తూ ఉంటుంది. ఐతే గత కొంతకాలంగా ఆ మందులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో వ్యాధిగ్రస్తులకు సకాలంలో అందించలేకపోతున్నారు. ఇదే విధంగా పట్టణ, మండలంలోని హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీ సెంటర్లలో కూడా ఈ మందులు అందుబాటులో లేకపోవడంతో వ్యాధి సోకిన వారు ఆసుపత్రులకు వస్తుంటే సరైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైద్యులు ఉన్నారు. టీబీ మందులు బయట కొనుగోలు చేయాలంటే దాదాపుగా రూ.3వేలకు పైనే ఉంటాయని పలువురు రోగులు చెబుతున్నారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు టీబీ రోగులకు మందులు అందించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించండి'

తెనాలి రూరల్, ఏప్రిల్ 15: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల నాయకులు తాడిబోయిన శ్రీనిసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్‌లు అన్నారు. సోమవారం ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో తాడిబోయిన శ్రీనివాసరరావు, హరిప్రసాద్‌లు పలువురు నాయకులతో కలిసి పట్టణంలోని గంగానమ్మపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కరేటి రవి, కొండాయాదవ్, మాదల వెంకటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, నిమ్మకాయల సాంబశివరావు, కృష్ణ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలో మట్కా జూదం నిర్వహిస్తున్న ముగ్గురి అరెస్టు చేసిన్నట్లు అర్బన్ ఎస్సై ఎం రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని షరాఫ్ బజార్‌లో సోదాలు నిర్వహిస్తుండగా మట్కా జూదం నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకోని రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దళిత వికాసానికి యేసురత్నం కృషి: స్వర్ణలతాదేవి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15: దళిత వికాసానికి కనపర్తి యేసురత్నం ఎంతగానో కృషి చేశారని కార్ప్ సంస్థ డైరెక్టర్ స్వర్ణలతాదేవి చెప్పారు. ఐతానగర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం రాత్రి యేసురత్నంపై రాసిన ఆర్గానిక్ మేధావి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఆయన భావాలు నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, పిల్లి విద్యాసాగర్, చల్లపల్లి స్వరూపారాణి, పిల్లి వాసు, అశోక్, అబ్రహం, అబ్రహాంలింకన్ ప్రసంగించారు.

నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15: తెలుగు నాటక రంగ దినోత్సవం మంగళవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరుగుతాయి. సమతా ఆర్ట్స్ థియేటర్, ప్రజ్వలిత సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే దినోత్సవ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. మానవరాజ్యంలో అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తామని అనితరుడు పుస్తక పరిచయ సభ జరుగుతుందన్నారు. ముట్టడిలో నాటికలోని నటీనటులను సన్మానిస్తామన్నారు. కె.బాబురావు, రామలింగేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, కనపర్తి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో అప్రమత్తంగా ఉంటే ఆస్తి, ప్రాణ నష్టం నివారించవచ్చని ఫైర్‌ఆఫీసర్ కె.ప్రసాదరావు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్, ఆర్టీసీ బస్ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాద సమయంలో మంటలను అదుపు చేసేందుకు నీటిని చిలకరించే పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయానికి వెండి కిరీటాల బహూకరణ



దాతలు సమకూర్చిన వెండి కిరీటాలతో ప్రత్యేక పూజలందుకున్న సీతా రాములు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: మండల పరిధిలోని చింతలపూడిలో నూతనంగా నిర్మించిన రామాలయానికి దాతలు సోమవారం వెండి కిరీటాలను బహూకరించారు. గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె ఆషా రామాలయానికి సుమారు రూ.2 లక్షల విలువైన వెండి కిరీటాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం హనుమత్ లక్ష్మణ సమేత సీతారాములకు వెండి కిరీటాలను అలంకరించి పూజలు చేశారు. అలాగే మండల పరిధిలోని వడ్డిముక్కలలోని కోదండరామస్వామి ఆలయంలో దాతల సహకారంతో స్వామికి బంగారుల పతకాలు, ముత్యాలహారాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చిలకపాటి వీర రాఘవాచార్యులు, దేవరాజస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నంబూరు వీవీఐటీ లో సందడి చేస్తున్న చిత్ర బృందం

వీవీఐటీలో 'మై డియర్ దొంగ' చిత్రబృందం సందడి

పెదకాకాని, ఏప్రిల్ 15: 'మై డియర్ దొంగ' చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృంద సభ్యులు అభినవ్, శశాంక్, షాలిని, దివ్యశ్రీపాద వీవీఐటీ కళాశాలను సందర్శించారు. అభినవ్ గోమఠం, షాలినీ, దివ్యశ్రీపాద ప్రధానపాత్రలలో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిందని చిత్ర బృందం తెలిపారు. హీరో అభినవ్ గోమఠం మాట్లాడుతూ చిత్రం ఆద్యంతం హాస్యప్రధానంగా సాగుతుందని తెలిపారు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు విశేష స్పందన వచ్చిందని, ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంద అన్నారు. అనంతరం చిత్రబృంద సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

ఈవీఎంల పనితీరుపై శిక్షణ తరగతులు



ఈవీఎంలపై అవగాహన కలిపిస్తున్న సిబ్బంది

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15: ఈవీఎంలు, వీవీప్యాట్ పనితీరుపై ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులు సోమవారం జరిగాయి. మండల పరిధిలోని వీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం 353మంది పోలింగ్ అధికారులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవీఎం, వీవీప్యాట్ పనితీరు, వాటి నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు ఈవీఎం, వీవీప్యాట్‌లు అనుసంధానించటం, ఓటింగ్ ప్రక్రియ నిర్వహించటం పోలింగ్ పూర్తయిన తర్వాత వాటిని భద్రపరిచే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులలో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ లక్ష్మీకుమారి, సహాయ ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభలకు ప్రజాదరణ లేకే గులకరాయి డ్రామా

● టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్

పెదకాకాని, ఏప్రిల్ 15: సిద్ధం సభలకు ప్రజాదరణ లేక కోడి కత్తి డ్రామా మాదిరిగా వైసీపీ నేతలు గులకరాయి డ్రామా మొదలు పెట్టారని టీడీపీ దళిత నాయకులు తెలిపారు. సోమవారం పెదకాకాని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి చిన్న రాయి తగిలితే నానా యాగీ చేస్తున్న వైసీపీ నేతలు దళిత డాక్టర్ సుధాకర్‌ను అన్యాయంగా నడిరోడ్డుపై కొట్టినప్పుడు, చీరాలలో ఎరిచర్ల కిరణ్ కుమార్ అనే దళితుడిని మాస్క్ లేదని ప్రాణాలు బలిగొన్నప్పుడు, పల్నాడులో రామచంద్రయ్య యాదవ్‌ని జై జగన్ అనలేదని వైసీపీ గూండాలు హత్య చేసినపుడు, రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే బీసీ బాలుడిని పట్టపగలే పెట్రోల్ పోసి తగలపెట్టినప్పుడు కనీసం స్పందించలేని వైసీపీ కుహనా మేధావులు రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు పవన్ కల్యాణ్‌లపై బురదజల్లుతూ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యా రాజకీయాలు వైసీపీకి జగన్ మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి కూడా షర్మిల, సునీతరెడ్డిల రూపంలో జగన్ ఓటమిని కోరుకుంటున్నారని, జగన్ మోహన్‌రెడ్డి రౌడీరాజ్యంను పారదోలేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, ప్రజలు వైసీపీ బూటకపు నాటకాలు నమ్మే రోజులు పోయాయని తెలిపారు. యానాది ఆదివాసీల సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును అడ్డుకున్న గిరిజనులపై తుపాకులతో తలకాయలు, వీపులు పగులగొట్టడంపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి యేసుబాబు మాట్లాడుతూ నంబూరు గ్రామంలో యానాదుల కాలనీ వద్ద జగన్ మోహన్ రెడ్డికి సమస్యలు విన్నవించుకునేందుకు వెళితే సెక్యూరిటీతో వినతిపత్రాన్ని చించివేసి అమానుషంగా తోసివేశారని ఆరోపించారు. సమావేశంలో మండల టీడీపీ సీనియర్ నేతలు లింగంగుంట సాల్మన్ రాజు, పొన్నూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు బెజ్జం గోపాలకృష్ణ, బి.లాజర్, కె.మాణిక్యరావు, బురదగుంట రాజు, ఎం.రవికుమార్, జె.అనీల్ పలువురు టీడీపీ ఎస్సీ ఎస్టీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులలో సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెరగాలి: మురళీకాంత్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15: విద్యార్థులలో సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెరగాలని నెహ్రూనికేతన్ స్కూల్ ఎండీ మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని స్కూల్‌లో విద్యార్థులు నేర్చుకున్న వివిధ సాంకేతిక అంశాలను వివరించే ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులతో కాలక్షేపం చేయటం తగ్గించుకోవాలన్నారు. తాము నేర్చుకున్న వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించి అధ్యాపకులు, ఉపాధ్యాయుల అభినందనలు పొందారు.